

**సవితకి పెళ్లిట-ఈ నోటా ఆ నోటా ఆ వార్త నాకు చేరింది. సవితకి పెళ్లంటే నాకొక కంట ఆనంద బాష్పాలూ- ఇంకో కంట విషాద ధారలూ కారేయి.**

సవితని నేను పెళ్లి చేసుకోవాలని అనుకున్నాను. నా నిర్ణయం వినగానే ''సిగ్గులేదా ఆ మాటనడానికి..'' నాన్న అరిచాడు.

''అసలా అమ్మాయి పెళ్లి చేసుకుంటుందనే అనుకుంటున్నావా?'' అంది అమ్మ.

''ఎందుకు చేసుకోకూడదూ? అంటున్నాను..'' అన్నాన్నేను కఠినంగా.

''పెళ్లి చేసుకోనీ- ఇంకోణ్ణి చంపనీయ్-నువ్ మాత్రం దాని మెళ్లో 'పుటుక్కు-మనే' తాళికట్టి-'గుటుక్కు-'మనడానికి నేను ఒప్పుకోను!'' నాన్న ఉగ్రస్వరం.

''అవున్రా దాని జాతకం అలాంటిది! కట్టుకున్న నెల్లోగానే మొగుడు యాక్సిడెంటైపోయాడంటే...'' అంది అమ్మ.

ఇలా మా ఇంట్లో రాద్ధాంతాలూ సిద్ధాంతాలూ జరుగుతున్నాయి.

ఇవ్వాళో రేపో ఇంట్లోవాళ్లతో పోట్లాడైనా-సవితని నాదాన్ని చేసుకోవాలనుకున్నాను.

★ ★ ★

''అసలు నీలాంటి బుద్ధిలేనివాణ్ణైనా రెండో పెళ్లాడతానంటే..ఆ అమ్మాయికి నీతి నియమాల మీద ఎంత గౌరవం వుందో అర్థమౌతోంది'' మొన్న నాన్న మళ్లీ నన్నూ, ఆ అమ్మాయినీ తిట్టిపోశాడు.

''మీరు నన్ను బుద్ధిలేనివాణ్ణని తిట్టండి..ఒప్పుకుంటాను- ఆ అమ్మాయిని నీతి నియమాలు లేని దనకండి'' ఫైనల్ వార్నింగ్‌లా అరిచాను.

★ ★ ★

'ఇవ్వాళో రేపో వెళ్ళాలి' అనుకున్నాను.

'అసలు..సవితని..మళ్లీ పెళ్లికొప్పించటం పెద్ద శ్రమే అనుకుంటున్నాను'

ఇంతలోకే శుభవార్త-

సవిత పెళ్లివార్త! ఆనంద విషాదాల సమ్మేళనం!!

ఆనందం...ఆ అమ్మాయి పెళ్లికొప్పుకున్నందుకు. బాధ..సవితని నేను మిస్సయినందుకు.

దేవుడున్నాడు-ఉంటే సవితకి మేలు చేస్తాడు.

దేవుణ్ణంతగా నమ్మని నాకు దేవుడిమీద



భారం వేయచ్చనిపించింది.

సాయంత్రం సవిత ఇంటికి బైల్దేరాను.

సవితా నేనూ ఒకేసారి డిగ్రీ కంప్లీట్ చేశాం.

'వహ్వా' అనిపించే అందం కాదు...తనది! 'వారెవ్వా' అనిపించే మంచి మనస్సు ఆమెది! చాలాసార్లు కాలేజీలో ఆమె ప్రవర్తన చూసి, 'నేను నిన్ను ప్రేమిస్తున్నాను. మనం పెళ్లి చేసుకుందామా' అని అడగాలనుకున్నాను.

కానీ ఆ అమ్మాయి డిగ్నిటీని చూస్తే భయమేసి 'ఛీ' అంటే ఆ పరిచయమైనా మిగల్దని భ్రమలోపడి- మాటను గొంతులో నొక్కు-కున్నాను.

అప్పుడూ అప్పుడూ వాళ్లింటికి వెళ్ళడం- రోడ్డుమీద ఎప్పుడైనా కన్పించినప్పుడు...

''హాయ్..బై'' అనుకునేవరకు మా స్నేహం పరిమితం - మొదటిసారి.

సవిత స్వయంగా, పెళ్ళి కార్డు తెచ్చి..ఇచ్చినప్పుడు చాలా ఆనందంగా రిసీవ్ చేసుకున్నాను.

పెళ్ళికి నేను వెళ్ళలేదు-

రిసెప్షన్‌కైనా వెళ్ళాలని..వెళ్ళకపోతే ఈర్ష్యతో మానేసానని అనుకుంటుందని వెళ్ళాను.

పెళ్ళికొడుకు నాకన్నా బావున్నాడు.

ఏదో గిఫ్ట్ ఇచ్చి...నవ్వు మొహం పులుముకుని గ్రూప్ ఫోటో దిగాను.

మొగుడికి చెవిలో నన్ను పరిచయం చేసింది సవిత.

అప్పుడు నాకేసి చూసాడు పెళ్ళికొడుకు-

'పిచ్చి వెధవా! ఇంత అందమైన అమ్మాయిని మిస్సయ్యావా?' అన్నట్టు అన్పించింది చూపు.

పెళ్ళయిన నెల్లాళ్ళకే ఆ అందగాడు మబ్బుల్లో కెళ్ళిపోయాడు.

అమావాస్య సవితను కమ్మేసింది.

ఓదార్చడానికి వెళ్ళాలనిపించలేదు.

అందంగా నవ్వే సవిత మొహం మిస్సవ్వాలనిపించలేదు.

కన్నీళ్ళింకిపోయాక..ఓ నెల్లాళ్ళకి సవితను చూడొచ్చన్న ధైర్యం వచ్చింది.

సవిత కళ్ళలో నీళ్ళు లేవు.

'అమ్మయ్య' అనిపించింది.

ఆ కళ్ళల్లో మునపటి వెలుగూ లేదు.

బాధేసింది.

మోడువారిన చెట్టును చూడ్డం..

మొగలాయిలు నరికేసిన అందమైన విగ్రహాన్ని చూడ్డం..

...ఎంత కష్టం..

ఐదారు నెలల్లో ఖాళీ ఉన్నప్పుడల్లా సవితను చూసొచ్చేవాణ్ణి.

ఇప్పుడు ఇంట్లో 'ఊ' అన్పించుకున్నాక సవితతో పెళ్ళిమాట మాట్లాడదామని నా ప్రయత్నం.

నాకన్నా ముందే సవిత తల్లిదండ్రులు ధైర్యం చేసి ఆ అమ్మాయి నొప్పించి-పెళ్ళికి సిద్ధం చేశారన్నమాట.

నాదెప్పుడూ లేట్ ఎంట్రీయే.

సవితను కలిసాను.

ఆ అమ్మాయి కళ్ళు నవ్వుతూ..వెలుగుతున్నాయి.

నిజంగానే సంతోషించాను.

సవిత నన్ను ఆనందంగా రిసీవ్ చేసుకుంది.

''నాకు మళ్ళీ పెళ్ళిట!'' అంది.

''మళ్ళీ కాదు..జరిగింది బొమ్మల పెళ్ళి..ఇప్పుడే అసలైన పెళ్ళి'' అన్నాను అభినందన పూర్వకంగా.

సవిత నన్ను చాలా ఆత్మీయంగా చూసి- ''నా ఉడ్ బీ..కంట్రీ క్లబ్‌లో సాయంత్రం తన ఫ్రెండ్స్‌కి పార్టీ ఇస్తున్నాడు. అమ్మానాన్న పెళ్ళి పనుల్లో హడావుడి..నువ్వు రావా చ్చుగా..సుబ్బూ!'' అంది.

''పానకంలో పుడకలా..'' నవ్వేసాను.

''కాదు..కూల్ డ్రింక్‌లో స్ట్రాలా..''

''స్ట్రానా..ఎక్స్‌ట్రానా?''

''నీతో నేను వాదించలేను..నువ్ రావా అంతే..!''

''సరే..సవితా!! తప్పకుండా వస్తాను''

★★★

కంట్రీ క్లబ్‌లో ఆరోజు పెళ్ళికొడుకు అనబడే హరిప్రసాద్‌ని మొట్టమొదటిసారి చూసాను. హరిప్రసాద్‌కి చాలామంది ఫ్రెండ్స్ ఉన్నారు. అందరూ కలిసి గంజాయి వనమే అయింది.తులసిమొక్క 'సవిత..ఒక్కత్తే' అనిపించింది.

ఆడేవాళ్ళూ.. తాగేవాళ్ళూ.. వాగేవాళ్ళూ.. అందరూ హరిప్రసాద్ స్నేహితులు.

'నీ స్నేహితులు ఎలాంటివాళ్ళో చెప్పు నువ్వెలాంటివాడవో చెప్తాను' అన్న మహనీయుల కొటేషన్ నా మదిలో మెదిలింది!

సవిత ముందు..అతని ఆడ స్నేహితులు.

తాగి ఆడే మగ స్నేహితులు...విచ్చలవిడిగా మాట్లాడేస్తుంటే..సవిత నన్ను పిల్చి ''ఇంటికెళ్లిపోదాం సుబ్బూ..తోడొస్తావా?'' అంది జాలిగా.

''చాలా మంచి నిర్ణయం..పద'' అన్నాన్నేను.

మేము బయల్దేరడం హరిప్రసాద్ గమనించే స్థితిలో లేడు-''సరే పో'' అన్నట్టు మరో అమ్మాయితో కబుర్లలో పడిపోయాడు.


బయటికి వచ్చి ఆటో ఎక్కిన మేము- ఒకర్తో ఒకరం మాట్లాడుకోలేదు.

ఇంటికొచ్చాక సవిత తల్లితండ్రీ ''ఏమ్మా! అప్పుడే వచ్చేశావ్?'' అన్నారు.

''నా రెండో మొగుడు కూడా చచ్చిపోయాడు నాన్నా!'' అని ఏడుస్తూ గదిలోకెళ్ళిపోయింది.తల్లిదండ్రులు స్థాణువులయ్యారు.

నేను మొహమాట పడుతూనే విషయం వివరించాను.

''సవితను పెళ్ళికి ఒప్పించడానికి చాలా



తంటాలు పడ్డాం బాబూ..మేము ఎంచుకున్న సంబంధం, మా తొందరపాటు తప్పని తేలింది''

నాకూ అయోమయంగా వుంది.

''నేనొక్కసారి సవితతో మాట్లాడనా?'' నా గొంతు నాకే స్థిరంగా విన్పించింది.

''మా వల్ల ఓదార్చడం అవదు.. పెళ్ళి అని ఆశ పెట్టకపోతే పిల్లకు ఇంత దుఃఖం ఉండేది కాదు!'' అంది సవిత అమ్మగారు.

''నువ్వే మాట్లాడు! నా మాట పోయింది! నాకు మాట్లాడే అర్హతా పోయింది'' అన్నాడు సవిత తండ్రి.

సవిత గదిలోకెళ్ళాను.ఏడుస్తున్న ఆమె కన్నీళ్ళు తుడిచి ఆ నీటితో నుదిటిపై బొట్టు పెట్టాను.

''నేను నిన్ను పెళ్ళి చేసుకుంటే నీకు ఇష్టమేనా?'' అన్నాను.

''నిజమా..!!'' మరిన్ని కన్నీళ్ళు కార్చింది సవిత.

''నీకు నిశ్చయమైన ముహూర్తానికే నీ మెళ్ళో తాళి..కళ్ళల్లో కాంతి చూస్తాను'' అని చెంపల మీద జాలువారుతున్న ఆనందబాష్పాల్ని పెదవుల్తో పట్టి-నుదిటిమీద బొట్టు చేసాను...ఈ ఆనందబాష్పాల తడి ఆరకూడదని.